సాక్షి
జోగుళాంబ గద్వాల

సోమవారం। 19। జూన్। 2023



ఆర్టీసీ లాజిస్టిక్ పరుగులు

ఆర్టీసీలో ప్రవేశపెట్టిన లాజిస్టిక్ (కార్గో) సేవలు మంచి సత్ఫలితాలు సాధిస్తున్నాయి.

వివరాలు IIలో ▸



రైల్వే పనుల పరిశీలన

జోగుళాంబ రైల్వేహాల్ట్ వద్ద ట్రాక్ పనులను దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం పరిశీలించారు.

వివరాలు IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.2 /28.1

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంజన్న సన్నిధిలో భక్తజన సందడి



ఎర్రవల్లిచౌరస్తా: అమావాస్యను పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయాన్నే అభయాంజనేయస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు తమలాకుల పూజ, పంచామృత అభిషేకం నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు నుంచి భక్తులు ఉదయాన్నే ఇక్కడికి చేరుకొని కృష్ణానదిలో స్నానాలు ఆచరించి అనంతరం అభయాంజనేయస్వామియుడు, శివాలయాన్ని దర్శించుకున్నారు. ముందుగా కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రేపు బీచుపల్లిలో సీతారాముల కళ్యాణం

బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

ఉపాధి కల్పించాలి

రాజోళి: పవర్ లూమ్ మగ్గాల ద్వారా చేనేత కార్మికుల ఉపాధి కోల్పోతున్నారని, దాని నుండి కార్మికుల జీవనానికి రక్షణ కల్పించాలని కార్మికులు అంటున్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రం రాజోళిలో చేనేత కార్మికులు జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్ కు, చేనేత శ్రామిక సేవా సమితికి ఆదివారం వినతి పత్రం అందచేశారు. పవర్ లూమ్ మగ్గాలపై నేసిన చీరలను తీసుకువచ్చి జిల్లాలోని కొందరు వ్యాపారులు అమ్మకాలు చేస్తుండటంతో, కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. చేనేత చీరలను వ్యాపారులు ఎక్కువగా అమ్మకపోవడంతో, మాస్టర్ వీవర్స్ కార్మికులకు ఇచ్చిన ఆర్డర్స్‌ను వెనక్కు తీసుకుంటున్నారని, చీరలు ఇప్పుడే నేయవద్దని చెప్పి, మెటీరియల్ కూడా ఇవ్వకపోవడంతో కార్మికులు తమ ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన చెందుతన్నారు. చీరలు తయారు చేసే పనినే కూలీగా చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు వ్యాపారులు పవర్ లూమ్ చీరల ద్వారా గడ్డు పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిపై చేనేత జౌళి శాఖ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విషయాన్ని తెలియచేసి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత శ్రామిక సేవా సమితి సభ్యులు వీరేష్, కార్మికులు పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో హాస్టళ్ల నిర్మాణం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు యూనివర్సిటీ ప్రాంగణంలో రూ.20 కోట్లతో రెండు హాస్టళ్లను నిర్మించనున్నట్లు పీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ నెల 17న హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖతో రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ సమక్షంలో ఒప్పందం కుదిరిందన్నారు.

నేడు డ్రోన్ శిక్షణ శిబిరం ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రం శివారులోని జేపీఎన్‌సీఈలో సోమవారం ఉదయం 10.30 గంటలకు 'బూట్ క్యాంప్ ఆన్ డ్రోన్ టెక్నాలజీ' వర్క్‌షాపును కలెక్టర్ రవి నాయక్ ప్రారంభిస్తారని కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేతన్న ఘోష!



రాజోళిలో మగ్గంపై చీర నేస్తున్న కార్మికుడు (ఫైల్)

జిల్లాలో జోరుగా పవర్‌లూమ్ చీరల విక్రయం

- పేరుకుపోతున్న చేనేత చీరల నిల్వలు
- నేత కార్మికులకు పొంచి ఉన్న ప్రమాదం
- నిబంధనలకు విరుద్ధంగా 90 దుకాణాల్లో అమ్మకాలు
- కనిపించని అధికారుల చర్యలు



చీర నేస్తున్న మాదిగుండు జానకి

రాజోళి: చేనేత చీరలు, వస్త్రాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు నేత చీరలంటూ పవర్‌లూమ్ చీరలను కొనుగోలుదారులకు అంటగడుతున్నారు. దీంతో కొనుగోలుదారులు నష్టపోవడమేగాక కార్మికులు కూడా ఉపాధి కోల్పోయి వీధిన పడే ప్రమాదం ఉంది. జిల్లాలో నేత కార్మికులు వేలసంఖ్యలో ఉండగా.. గద్వాల, రాజోళి చీరలకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ పేర్లు చెప్పుకొని కరెంట్ మగ్గాలపై నేసిన చీరలను కొనుగోలుదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో కార్మికులు నేసిన చీరలు మాత్రం బీరువాల్లోనే మగ్గిపోతున్నాయి.

నేత చీరలకు డిమాండ్ ఉన్నా..

సాధారణంగా నేత కార్మికులు తయారుచేసిన చీరల్లో ఎంతో నైపుణ్యం దాగి ఉంటుంది. దీంతో పాటు మన్నిక కూడా ఎక్కువే. కాకపోతే చీర తయారు చేసేందుకు కార్మికుడి కష్టంతో పాటు పెట్టుబడి ఎక్కువ అవుతుంది. మాస్టర్ వీవర్స్ కూలీలకు ముడి సరుకు అందించి కార్మికులతో చీరలు తయారు చేయిస్తారు. కార్మికులు కూడా ఎంతో శ్రమకోర్చి చీరలు తయారు చేస్తారు. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. కానీ కరెంట్ మగ్గాలపై నేసే చీరలు కూడా నేత కార్మికులు తయారుచేసిన చీరలనే పోలి ఉంటాయి. అచ్చం అలాగే ఉండటంతో పాటు నేత చీరల కంటే తక్కువ ధరకు లభిస్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు కరెంట్ మగ్గాలపై తయారుచేసిన చీరలనే నేత చీరలుగా నమ్మించి విక్రయిస్తున్నారు. రెండురకాల చీరలు ఒకేచోట ఉంచి విక్రయిస్తుండటం.. కొనుగోలుదారులు ధరను బేరీజు వేసుకొని కరెంట్ మగ్గాలపై నేసిన చీరలు కొంటున్నారు. దీంతో నేత చీరల స్టాక్ అలాగే ఉండిపోవడంతో కార్మికులకు ఉపాధి తగ్గుతుంది.

నిబంధనలు అతిక్రమించి..

నేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గతంలో తీసుకొచ్చిన నిబంధనలను జిల్లాలో వ్యాపారులు ఖాతరు చేయడం లేదు. చేనేత చీరలు విక్రయించే దగ్గర పవర్‌లూమ్ చీరలు అమ్మకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని లెక్కచేయకుండా ఒకే దుకాణాల్లో అమ్మకాలు చేస్తుండటం గమనార్హం. ఇతర రాష్ట్రాల్లో పవర్‌లూమ్స్‌కు విద్యుత్ చార్జీల్లో రాయితీ ఉండటంతో చీరలు తక్కువ ధరలకు లభిస్తుండంతో వ్యాపారులు అక్కడి నుంచి తీసుకొచ్చిన చీరలను మగ్గాలపై నేసిన చీరలుగా విక్రయిస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు.

పర్యవేక్షణ లేకపోవడంతో....

ఇంత జరుగుతున్నా.. చేనేత, జౌళిశాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు ఎక్కడ కూడా దాడులు చేసిన దాఖలాలు లేవు. దీన్నిబట్టి చూస్తే అధికారులకు కూడా ఈ విషయం తెలిసే జరుగుతుందని నేత కార్మికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేస్తే చేనేత రంగం తీవ్ర సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని.. ఆదిలోనే అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. కొన్నిచోట్ల కార్మికులు పెద్దఎత్తున ఉద్యమమే చేస్తున్నారని చెబుతున్నారు.

ఉపాధి తగ్గే ప్రమాదం..



మగ్గాలపై నేసే చీరలు ఎంతో మన్నికగా, ఎక్కువ కాలం నాణ్యతగా ఉంటాయి. కొందరు వ్యాపారులు ఇతర రాష్ట్రాల్లో పవర్ లూమ్స్‌పై తయారయ్యే చీరలను తక్కువ ధరకు తీసుకొచ్చి నేసిన చీరలని కొనుగోలుదారులకు అంటగడుతున్నారు. దీంతో కొనుగోలుదారులకు చేనేత చీరలపై ఉన్న నమ్మకం పోవడమేగాక కార్మికులకు ఉపాధి తగ్గుతుంది. అధికారులు దీనికి ఆదిలోనే చెక్ పెట్టాలి. లేకపోతే చేనేత రంగానికి ముప్పు తప్పదు. – వీరేష్, చేనేత కార్మికుడు, రాజోళి

ఒకేచోట విక్రయించకుండా చూడాలి..

ఒక చీర నేయడానికి వారానికిపైగా సమయం పడుతుంది. కరెంట్ మగ్గాలపై తక్కువ సమయంలో తయారు చేయవచ్చు. కాని వాటి నాణ్యతలో చాలా తేడా ఉంటుంది. నేత చీరలంటూ కరెంట్ మగ్గాలపై నేసిన చీరల అమ్మకాలు చేసి మా కడుపు కొడితే ఎలా. రెండురకాల చీరలు ఒకేచోట విక్రయించకుండా చర్యలు తీసుకోవాలి. – మాదిగుండు జానకి, చేనేత కార్మికురాలు, రాజోళి

విజిలెన్స్ అధికారులకు తెలియజేస్తాం..



జిల్లాలో చేనేత చీరలు, పవర్‌లూమ్ చీరలు ఒకేచోట విక్రయిస్తున్నారనే విషయాన్ని ఇంతవరకు కార్మికులెవరూ రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు తెలియజేస్తాం. – గోవిందయ్య, ఏడీ, చేనేత, జౌళిశాఖ, జోగుళాంబ గద్వాల జిల్లా

ఇంటింటికీ మంచినీరు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

ధరూరు: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ మంచి నీరు అందజేశామని, ఎక్కడా కూడా తాగునీటి సమస్యే లేదని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. ఆదివారం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్ జీరో పాయింట్ సమీపంలోని మిషన్ భగీరథ హెడ్ వర్క్స్ వద్ద మంచి నీళ్ల పండుగ కార్యక్రమం నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యేలు అబ్రహం, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి అన్ని వర్గాలకు మేలు చేశారన్నారు. తాగు పండుగను జరుపుకోవడం సంతోషకరంగా ఉందని, అందరి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. రైతులకు చిత 24గంటల విద్యుత్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు కేవలం రైతుల కొరకే ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ 100 లీటర్ల నీటిని అందిస్తున్నామని, ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ సరోజమ్మ, ఎంపీపీలు నజీమున్నీసా బేగం, మనోరమ, జెడ్పీటీసీ సభ్యులు పద్మా వెంకటేశ్వరరెడ్డి, రాజశేఖర్, వైస్ ఎంపీపీలు సుదర్శన్‌రెడ్డి, రామకృష్ణనాయుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలకరి జాడేది..?



మల్లంపల్లి శివారులో వేరుశనగను విత్తుకుంటున్న రైతు

గట్టు: ముంగారి సేద్యం ముందుకు సాగడం లేదు. గతానికి భిన్నంగా ఈ సారి ఎండలు ఇంకా దంచి కొడుతున్నాయి. మండే ఎండలకు పత్తి రైతులు చిత్తు అవుతున్నారు. మెట్ట భూములను సాగు కోసం రైతులు సిద్ధం చేసుకున్నారు. ముంగారి కాలం ప్రారంభమై వారం రోజులు గడచినా ఇప్పటికి తొలకరి రైతులను పలుకరించలేదు. వర్షాలు కురిస్తే చాలు విత్తుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. రోహిణి కార్తె (మే 25 నుంచి జూన్ 7 వరకు)లో రోళ్లు పగలేటంత ఎండలు ఉంటాయని.. ఈ కార్తెలో విత్తుకున్న పంటలకు తిరుగుండదని పెద్దలు చెబుతుంటారు. కొంత మంది రైతులు కమర్షియల్ పత్తితో పాటుగా వేరుశనగ పంటను ఈ కార్తెలోనే విత్తుకున్నారు. ఆ తర్వాత వచ్చే మృగశిర కార్తె (జూన్ 8 నుంచి 21 వరకు) తో వాతావరణం ఒక్కసారిగా నైరుతి రుతుపవనాల రాకతో చల్లబడుతుంటుంది. వర్షాలు కురువడంతో ఇది వరకే సాగు చేసుకున్న పంటలకు ఏ ఇబ్బంది ఉండదు.

గతానికి భిన్నంగా..

ఇదిలాఉండగా, ఈ సారి గతానికి భిన్నంగా జూన్ 19 వచ్చినా ఇంకా వాతావరణం చల్లబడక పోవడంతో బోరు నీటి ఆధారంగా పంటలను సాగు చేసుకున్న పంటలకు నీరందించలేక రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఎండలు ఇంకా మండుతూనే ఉంటుండడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ ఏడాది వేసవి కాలం మధ్యలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురువడంతో రైతులు ఎక్కువగా పత్తి పంటలను సాగు చేసుకున్నారు. మరి కొంత మంది రైతులు మెట్ట భూములను సాగుకు సిద్ధం చేసుకున్నారు.

వరుణదేవా..కరుణించవయ్యా!



జమ్మిచేడులో భజనలు చేస్తూ.. ఎడ్లబండ్లపై నీటిని తీసుకువస్తున్న రైతులు

గద్వాల: వర్షాలు సమృద్ధిగా కురవాలని.. రైతుకు సాగులో ఏ ఇబ్బంది లేకుండా చూడాలని.. సిరులు పండేలా చూడాలంటూ ప్రజలు వరుణదేవుడిని వేడుకున్నారు. వానాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా నేటికీ తొలకరి వర్షం పలకరించకపోవడంతో మండలంలోని జమ్మిచేడులో ఆదివారం ప్రజలు ఎద్దుల బండ్లతో నదీఅగ్రహారం సమీపంలోని కృష్ణానది వద్దకు చేరుకొని నీటికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి నీటిని భజనలు చేస్తూ, భక్తి గీతాలు పాడుతూ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఇప్పటికే వానాకాలం ఆలస్యమైందని, వరుణదేవా కరుణించవయ్యా.. అంటూ గ్రామ దేవతలకు పూజలు చేశారు.

బీజేపీ పోరాటాన్ని గుర్తించాలి

- జేపీ నడ్డా బహిరంగ సభకు స్వచ్ఛందంగా తరలిరండి
- బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు తీవ్ర అన్యాయం
- రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తేనే పేదల కోసం పనిచేసే రామరాజ్యం ఏర్పాటవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. పేదల కోసం పోరాటం చేస్తున్నది కేవలం బీజేపీనే అన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నెల 25న నాగర్‌కర్నూల్‌లో పర్యటిస్తున్న సందర్భంగా నిర్వహించే బహిరంగ సభ కోసం ఆదివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బండి సంజయ్ హాజరై జెడ్పీగ్రౌండ్‌లో చేపట్టనున్న సభాస్థలిని పరిశీలించారు. అంతకుముందు మీడియా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు ఎవరూ సంతోషంగా లేరని, బీఆర్ఎస్ పాలనలో పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల హామీలో చెప్పిన రుణమాఫీ, డబుల్ బెడ్‌రూం ఇల్లు అమలు చేయలేదని, కేంద్రం ఇస్తున్న ఫసల్ బీమాను రైతులకు అందించడం లేదని మండిపడ్డారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు రూ.10 వేల చొప్పున పరిహారం అందిస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు మళ్లీ భ్రమలు కల్పించేందుకే కులవృత్తులకు రూ.లక్ష చొప్పున ఇస్తామని మళ్లీ మోసం చేసేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. సీఎం కేసీఆర్ మాటలను జనం నమ్మే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ నేతలు దోపిడీతోనే వారిపైనే ఎక్కువగా ఐటీ దాడులు జరుగుతున్నాయని చెప్పారు. తప్పు చేసినవారు జైలుకు వెళ్లక తప్పదని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని వ్యాఖ్యానించారు. బీజేపీ వ్యక్తులపై ఆధారపడదని, కమలం గుర్తుపై ఎవరు పోటీలో ఉన్న గెలిచేలా పార్టీని శక్తివంతం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

స్వచ్ఛందంగా తరలిరావాలి..

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నెల 25న నాగర్‌కర్నూల్‌కు రానున్నారని, జిల్లాకేంద్రంలోని జెడ్పీ మైదానంలో సాయంత్రం నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రజలంతా స్వచ్ఛందంగా తరలిరావాలని బండి సంజయ్ కోరారు. సభకు లక్ష మంది వరకు జన సమీకరణ చేసేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దిలీపాచారి, కొండా మణెమ్మ, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, రాజవర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గట్టు మండలం చాగదోనలోని ఉన్నత పాఠశాల ఆవరణ



విద్యార్థుల బెంచీలు

సరికొత్త హంగులతో.. సర్కారు బడి

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల అంటే.. శిథిలావస్థకు చేరిన భవనాలు, తలుపులు, కిటికీలు లేని.. చీకటిమయమైన తరగతి గదులే గుర్తుకొచ్చేవి. కానీ, ఇప్పుడు సర్కారు బడి రూపురేఖలే మారాయి. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి పథకం కింద గట్టు మండలంలోని చాగదోన ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి నిధులను కేటాయించింది. పాఠశాల అభివృద్ధి పనులు చకచకా పూర్తి అయ్యాయి. కార్పొరేట్ పాఠశాలను తీసిపోని రీతిలో భవనం, ఆవరణ, విద్యార్థులు ఆడుకునేందుకు ఆట వస్తువులు, బెంచీలతో అద్భుతంగా తీర్చిదిద్దారు. నూతన హంగులు దిద్దుకున్న ఈ పాఠశాల ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తోంది. – గట్టు



ఆట వస్తువులు

క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి బలవన్మరణం


బీరయ్య (ఫైల్)

గోపాల్‌పేట: అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన రేవల్లి మండలంలోని శానాయిపల్లిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. శానాయిపల్లికి చెందిన బీరయ్య(37) గొర్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పెళ్లి కాగా.. ఒక పాప, బాబు ఉన్నారు. అయితే భార్య పది సంవత్సరాల క్రితమే విడిపోయి వేరుగా ఉంటుండగా.. బీరయ్య తల్లితండ్రులతోపాటు తన కూతురు, కుమారుడితో కలిసి శానాయిపల్లిలోనే ఉంటున్నాడు. ఇటీవల గొర్లవ్యాపారంలో నష్టం రావడం, దీనికి తోడు అప్పుల బాధ కూడా ఎక్కువయ్యాయి. ఇదే క్రమంలో కొంతకాలంగా మనస్తాపానికి గురవుతున్న ఆయన శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని చనిపోతానని చెప్పడంతో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు నచ్చజెప్పారు. ఆదివారం అందరూ తిని ఇంటి బయట పడుకున్న తర్వాత అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


రాజేష్ (ఫైల్)

కొల్లాపూర్: ఈతకు వెళ్లి ఓ బాలుడు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన మండ్ల అశ్వేష్ అలియాస్ రాజేష్ (13) తండ్రి తిరుపతయ్య చాలాకాలం క్రితమే మరణించడంతో తల్లి వనజ తన ఇద్దరు పిల్లలతో కలిసి కొల్లాపూర్‌లోనే ఉంటోంది. రాజేష్ శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా మిత్రులతో కలిసి ఖాదర్‌బాషా దర్గా సమీపంలోని బావిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. రాత్రి పొద్దుపోయే వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించారు. బావి వద్ద సైకిల్ కనిపించడంతో ఆదివారం ఉదయం పోలీసులు, ఫైర్ సిబ్బంది, స్థానికులు బావిలో గాలించారు. నీటి అడుగున మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. ముఖంపై గాయం ఉండటంతో బావిలోకి దూకినప్పుడు తలకు గాయమై మృతిచెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాజేష్ 8వ తరగతి పూర్తిచేశాడు. స్వగ్రామం పెద్దకొత్తపల్లి మండలంలోని వావిళ్లబావి కావడంతో అక్కడికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో యువకుడు..


భానుప్రకాష్ సాగర్ (ఫైల్)

పెబ్బేరు: మండలంలోని పాత సూగూర్‌లో ఇంటి నిర్మాణం పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో భానుప్రకాష్ సాగర్ (25) మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలకు నీళ్లు పట్టి విద్యుత్ బోర్డుకు ప్లగ్ తీస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు పెబ్బేరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, సీపీఆర్ అనంతరం వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భానుప్రకాష్ సాగర్‌కు తండ్రి, ఇద్దరు కుమారులు, ఒక కూతూరు ఉన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు.

ఆర్టీసీ లాజిస్టిక్ పరుగులు


మహబూబ్‌నగర్ బస్టాండ్‌లోని ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రం

- వినూత్న సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన
- ఆర్టీసీ కొరియర్ సేవలకు నేటితో మూడేళ్లు పూర్తి
- ఈనెల 17 వరకు రీజియన్‌కు రూ.10.83 కోట్ల ఆదాయం
- 10 లక్షలకుపైగా పార్సిల్ బుకింగ్‌తో.. రోజుకు రూ.2 లక్షలు

డిపో	పార్సిల్	కార్గో ఆదాయం (రూ.లలో)
మహబూబ్‌నగర్	3,03,235	3,06,81,954
జో.గద్వాల	2,15,866	2,74,60,860
వనపర్తి	1,05,446	97,16,678
నాగర్‌కర్నూల్	86,287	79,14,155
నారాయణపేట	76,908	78,50,231
షాద్‌నగర్	55,985	74,98,028
కల్వకుర్తి	65,138	65,64,499
అచ్చంపేట	54,956	54,68,255
కొల్లాపూర్	47,756	52,44,698

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించడానికి ప్రవేశపెట్టిన లాజిస్టిక్ (కార్గో) పార్సిల్ సేవలు మంచి సత్ఫలితాలు సాధిస్తున్నాయి. పార్సిల్ కార్గో సర్వీస్‌కు విశేష స్పందన లభిస్తోంది. దీంతో రోజురోజుకు కార్గో పార్సిల్ ఆదాయం పెరుగుతోంది. 2020, జూన్ 19న ప్రారంభించిన ఆర్టీసీ కార్గో, పార్సిల్ సేవలకు సోమవారంతో మూడేళ్లు పూర్తయింది.

రీజియన్ పరిధిలో..

మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు 2020, జూన్ 19 నుంచి ఈ ఏడాది జూన్ 17 వరకు లాజిస్టిక్ (కార్గో) కొరియర్, పార్సిల్ సేవల ద్వారా రూ.10,83,99,358ల ఆదాయం వచ్చింది. రీజియన్ వ్యాప్తంగా 10,11,577 పార్సిల్, కొరియర్ బుకింగ్స్‌తో ఈ ఆదాయం పొందింది. ప్రతిరోజు కార్గో సేవల ద్వారా రీజియన్‌కు రూ.2 లక్షలకుగాపై ఆదాయం వస్తోంది. నిత్యం 1,300- 1,500 వరకు పార్సిల్, కవర్లను ఒక బస్టాండ్ నుంచి మరో బస్టాండ్‌కు చేరవేస్తున్నారు. మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లో కార్గో సేవల కోసం పీసీసీ ఏజెంట్లను సైతం నియమించారు. లాజిస్టిక్ కార్గో ఇంటర్ స్టేట్ సేవలు అందిస్తున్నారు.

డిపోకు రూ.3 కోట్లు..

మహబూబ్‌నగర్ డిపో లాజిస్టిక్ (కార్గో) పార్సిల్ కొరియర్ ఆదాయంలో ముందంజలో ఉంది. మహబూబ్‌నగర్ డిపో ఇప్పటి వరకు రూ.3,06,81,954, గద్వాల డిపో రూ.2,74,60,860ల ఆదాయం వచ్చింది. కార్గో సేవల్లో మహబూబ్‌నగర్ డివిజన్ రూ.8,32,07,751, నాగర్‌కర్నూల్ డివిజన్ రూ.2,51,91,607ల ఆదాయాన్ని పొందాయి.

త్వరలో ఇంటి వద్దకే సేవలు..



ఎంపిక చేసిన కొన్ని పెద్ద పట్టణాల్లో త్వరలో ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు ఇంటి వద్దే అందేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఆర్టీసీ లాజిస్టిక్ సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గ్రామస్థాయి వరకు లాజిస్టిక్ సేవలను విస్తృతం చేస్తాం. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో కార్గో ప్రైవేట్ ఏజెన్సీలు ఏర్పాటు చేయడం జరిగింది.

– దేవేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల ఆర్టీసీ లాజిస్టిక్ ఏటీఎం

వినూత్న సేవలు..

ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా ప్రజలకు వినూత్న సేవలు అందిస్తున్నారు. రెండేళ్ల క్రితం సమ్మక్క, సారక్క జాతరను పురస్కరించుకొని ఆర్టీసీ కార్గో ద్వారా భక్తులకు మేడారం ప్రసాదాన్ని సరఫరా చేశారు. అలాగే రెండేళ్ల నుంచి శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని ఇంటి వద్దకే భద్రాద్రి రాములోరి తలంబ్రాలు అనే కార్యక్రమం చేపట్టారు. గతేడాది వేసవిలో మ్యాంగ్ ఎక్స్‌ప్రెస్ పేరోతో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వారికి భంగినపల్లి మామిడిపండ్ల ప్యాకెట్లను ఇంటి వద్దకే చేర్చారు.

కార్గో బస్సులతో..

మహబూబ్‌నగర్ రీజియన్‌లో ఆర్టీసీ కార్గో బస్సుల ద్వారా కూడా సేవలు అందిస్తున్నారు. ఆర్టీసీ కార్గో బస్సు సేవలను 2020 జూలై మొదటి వారంలో ప్రారంభించగా ఈ నెల 17 వరకు రూ.34,35,673ల ఆదాయం వచ్చింది. కార్గో బస్సుల సేవల్లో కల్వకుర్తి డిపోకు అత్యధికంగా రూ.20,94,059 ఆదాయం సమకూరింది.

రైల్వే పనులను పరిశీలించిన డీఆర్‌ఎం


ఉండవెల్లి శివారులోని రైల్వే ట్రాక్ పనులపై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం

- ఉండవెల్లి శివారులో కొనసాగుతున్న ట్రాక్ పనులు


రైల్వే పనులల్లో ఉన్న యంత్రాలు

ఉండవెల్లి: రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం, ఆటంకం కలుగకుండా ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం శరత్ చంద్రయాన్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉండవెల్లి శివారు జాతీయ రహదారి రైల్వే ఓవర్ బ్రిడ్జికు, జోగుళాంబ రైల్వేహోల్ట్ మధ్యలో ఉన్న రైల్వే ట్రాక్ పనులు నిర్వహించారు. బుధవారం, గురువారం, ఆదివారాలు మాత్రమే పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ట్రాక్‌లో పాతమట్టిని తొలగించి కొత్త మట్టిని, కంకర మిక్చర్‌ను, వేసి కుంగకుండా ట్రాక్‌లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రీషియన్‌తో పనుల గురించి మాట్లాడారు. సబ్‌ఇంజనీర్‌తో పలు పనులపై ఆరా తీశారు. దాదాపు 10మంది ఇంజనీర్లు, 10 మంది సూపర్‌వైజర్లు, ట్రాక్‌మెన్లు, 50 మంది కూలీలు, 3 క్రేన్లు, 4 ప్రొక్లేన్‌లు, 4ఇటాచీలు, రెండు రోడ్డు రోలర్లు, సహాయంతో మరమ్మతులు నిర్వహించారు. 231 కి.మి నుంచి 235 కి.మీ వరకు ట్రాక్ మరమ్మతులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు దాదాపు 4గంటల సమయం వరకు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. గూడ్స్‌ను దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజనీర్ కోఆర్డినేటర్ మల్లికార్జున, వెంకన్న, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ అనిల్‌కుమార్, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ అహ్మద్ ఉన్నారు.

రైల్వేస్టేషన్ పరిశీలన..

మానవపాడు: మండల కేంద్రంలోని మానవపాడు రైల్వేస్టేషన్‌ను ఆదివారం రైల్వే డీఆర్‌ఎం శరత్‌చంద్రయాన్ పరిశీలించారు. మండలం నుంచి ఉండవెల్లి వరకు రైల్వేట్రాక్ పరిశీలించారు. డీఎం, డీఎంఈ, సీఎచ్‌సీ, మానవపాడు రైల్వేస్టేషన్ మాస్టర్ ప్రతాప్‌రెడ్డి, సూపరింటెండెంట్ సురేష్ ఉన్నారు.

కృత్రిమ తేనె సేకరణతో లాభాలు

- సెంట్రల్ ఖాదీ ఇండస్ట్రీస్ బోర్డు చైర్మన్ మనోజ్‌కుమార్


చెంచులతో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

మన్ననూర్: అడవుల్లో ఉంటూ తేనె సేకరణతో జీవనం సాగించే ఆదివాసీ చెంచులు కృత్రిమ తేనె సేకరణతోపాటు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేందుకు తమవంతు కృషిచేస్తామని సెంట్రల్ ఖాదీ ఇండస్ట్రీస్ బోర్డు చైర్మన్ మనోజ్‌కుమార్ అన్నారు. ఆదివారం కోనేరు సంస్థ సభ్యులతో కలిసి అమ్రాబాద్ మండలం సార్లపల్లి చెంచులతో ఆయన సమావేశమయ్యారు. ప్రత్యేకించి తేనె సేకరణతో లబ్ధిపొందుతున్న తీరు గురించి చెంచులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తేనె సేకరణ కంటే ప్రస్తుత ఆధునిక పద్ధతులతో తేనె సేకరించడంలో ఎలాంటి ఇబ్బందులు లేవని, ప్రమాదాలు జరిగే అవకాశం తక్కువ అన్నారు. హనీ బీ కీపింగ్ బాక్స్‌లలో తేనె టీగలను పెంచి తేనె ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. బాక్స్‌లలో తేనెటీగలను పెంచే విధానంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ పద్ధతులను అనుసరిస్తూ తేనె సేకరించేందుకు ముందుకు వస్తే ఒక్కో కుటుంబానికి 7 నుంచి 10 బాక్స్‌లు అందజేస్తామని చెప్పారు. అలాగే ఆహార భద్రతలో భాగంగా పౌష్టికాహార లక్షణాలు కలిగిన చిరుధాన్యాల పంటలు సాగు చేసుకొని వాటినే ఆహారంగా తీసుకోవాలని సూచించారు. కోనేరు సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన సీ మార్ట్‌ను సందర్శించారు. చెంచుల అభివృద్ధి కోసం కోనేరు సంస్థ చేపడుతున్న వివిధ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, డిప్యూటీ సీజీఎం పాండే, కేవీఐసీ స్టేట్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ లంక, నారాయణ, సంజీవరావు, కోనేరు సంస్థ డైరెక్టర్ ఎంఏ సలీం, ఇస్మాయిల్, పెద్దులు, బాలు, తిరుపతయ్య పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

స్టేషన్ మహబూబ్‌నగర్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఏఐసీసీ ఆదివాసి వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్లకే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్లు పూర్తికాకుండానే ఉత్సవాలు నిర్వహించడం ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. ఇంటికో ఉద్యోగమంటూ ప్రజలను మోసం చేసినట్లు ఆరోపించారు. రాష్ట్ర విభజనకు ముందు 36వేల ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఉంటే, వాటిని ఇప్పటివరకు భర్తీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఏమి చేసిందని మంత్రి కేటీఆర్ అంటున్నారని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఉద్యోగుల పేరు మీద మంత్రి అయిన శ్రీనివాస్‌గౌడ్ ఏనాడైనా ఉద్యోగుల సమస్యల గురించి మాట్లాడారా అని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో గెలుస్తున్నదని అన్నారు. ఈనెల 25 లోపు కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం కమిటీల నియామకం చేస్తామని తెలిపారు. 29న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర ముఖ్యనాయకుల సమావేశంలో నియామకపత్రాలు అందజేస్తామని తెలిపారు. డీసీసీ అధ్యక్షులు జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల పేరిట బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్షతోనే మంత్రులైన విషయాన్ని మరిచిపోకూడదని హితువుపలికారు. కాంగ్రెస్ పార్టీ కట్టిన ప్రాజెక్టుల వల్లే జిల్లాలో నీళ్లు పారుతున్నట్లు తెలిపారు. సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షులు లింగంనాయక్, నాయకులు సిరాజ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం నాయకుల సమావేశం నిర్వహించారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షులు బెల్లయ్య నాయక్

అన్నను కడతేర్చిన తమ్ముడు

- భూ తగాదాలే కారణం


రాంరెడ్డి (ఫైల్)

ఆత్మకూర్: భూ తగాదాలతో అన్నను తమ్ముడు కడతేర్చిన ఘటన మండలంలోని మూలమళ్లలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ కేఎస్ రత్నం, ఎస్‌ఐ మహ్మద్ అంజద్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పాకనాటి రాంరెడ్డి (64), అతడి తమ్ముడు శ్రీనివాస్‌రెడ్డి మధ్య కొనేళ్లుగా భూ వివాదం కొనసాగుతుంది. పలుమార్లు దాడులు కూడా చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో పొలం వద్ద అన్న, తమ్ముడు గొడవ పడుతుండగా గుర్తించిన పరిసర పొలాల రైతులు రాంరెడ్డి కుమారుడు శేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న శేఖర్‌రెడ్డికి ఎవరూ కనిపించకపోవడంతో గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ, ఎస్‌ఐ, గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని టార్చిలైట్ల వెలుగులో గాలింపు చేపట్టగా పొలంలోని బావిలో మృతదేహం లభ్యమైంది. బయటకు తీసి పరిశీలించగా తలకు బలమైన గాయం ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తన తండ్రిని చిన్నాన్న శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుమారుడు కన్నారెడ్డి పథకం ప్రకారం హత్య చేశారని రాంరెడ్డి కుమారుడు శేఖర్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని వివరించారు. హత్య ఘటనతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి.

తుంగభద్ర నదిలో మునిగి భక్తుడు మృతి

అలంపూర్ రూరల్: అలంపూర్‌లోని తుంగభద్ర నదికి స్నానానికి వెళ్లిన ఓ భక్తుడు అందులో మునిగి మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మృతుడు బాలకృష్ణ స్నేహితుల కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం బండ్రవల్లికి చెందిన బాలకృష్ణ (21), నికిల్, హర్షవర్ధన్, వెంకటేష్, మణికంఠ జోగుళాంబ అమ్మవారి దర్శనానికి రైలులో అలంపూర్‌కు వచ్చారు. స్నానం చేసేందుకు నదిలో దిగిన బాలకృష్ణ మిత్రులు ఎంత వారించినా వినకుండా ఈత వస్తుందంటూ లోనికి వెళ్లి మునిగిపోయాడు. రెండుగంటల పాటు పోలీసులు, గజ ఈతగాళ్లు గాలించగా మృతదేహం లభించింది.

బావిలో పడి వ్యక్తి..

గోపాల్‌పేట: బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వనపర్తి సమీపంలో చోటు చేసుకుంది. వనపర్తి పట్టణ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి కథనం మేరకు.. వనపర్తి వర్షాతండాకు చెందిన కేతావత్ రమేష్ (26) కేతావత్ మమత భార్యాభర్తలు. వీరికి ఒక బాబు ఉన్నాడు. రమేష్ ట్రాక్టర్ డ్రైవరుగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. రోజులాగే శనివారం బయటికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆదివారం కుటుంబ సభ్యులు, తెలిసిన వారు వెదకగా కాశీంనగర్ రోడ్‌లోని బావిలో మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి బయటికి తీసి చూడగా కేతావత్ రమేష్ మృతదేహంగా గుర్తించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో 'రిషి' ఫైచేయి


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో జిల్లాకేంద్రంలోని రిషి కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తాచాటారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో బాలవర్ధన్ 37వ ర్యాంక్, కౌశిక్‌యాదవ్ 2,277, మహేష్ 3,653, శ్రీనివాస్ 4,376, రాఘవప్రియ 7,862వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్‌పర్సన్ చంద్రకళావెంకట్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు, పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్, ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఇంజనీర్ అవుతా..



చిన్నప్పటి నుంచి ఇంజనీర్ కళాశాల కల కోసం ఎంతో శ్రమించా. అందులో భాగంగా జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు వచ్చింది. ర్యాంకు సాధించేందుకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ఎంతో సహకరించారు. అనుకున్నట్లు ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. ఇంజినీరింగ్‌లో రైతులకు ఉపయోగడే కొత్త అంశాలను ఆవిష్కరించాలనేది నా ఆశయం.

– బాలవర్ధన్, రిషి కళాశాల, పీడబ్ల్యూడీ 37వ ర్యాంక్

డాటా సైంటిస్టు..



ర్యాంకు సాధించేందుకు ఇంటర్మీడియట్ ప్రారంభం నుంచి ఎంతో క్రమశిక్షణతో చదివా. డాటా సైంటిస్టు కావాలనేది నా కల. ప్రిపేర్ అవుతున్న క్రమంలో సందేహాలు వస్తే అధ్యాపకులు వెంటనే తీర్చేవారు. దీంతో ప్రిపరేషన్ ఎంతో సజావుగా సాగింది. యాజమాన్యం, మా తల్లిదండ్రులు సహకరించారు.

– కౌశిక్‌యాదవ్, రిషి కళాశాల, 2,278వ ర్యాంక్

'ప్రతిభ' విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ప్రతిభ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో విజయకేతనం ఎగురవేశారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు ఇబ్రహిం 219వ ర్యాంకు, గౌతమ్ 652, కరుణాకర్ 762, కార్తిక్ 787, గణేష్‌నాయక్ 1,377, శివతేజ 1,927, తనుశ్రీ 3,820వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మంజులాదేవి మాట్లాడుతూ కళాశాల ప్రారంభం నుంచి ఎంతో మంది విద్యార్థులను డాక్టర్లు, ఇంజినీర్లుగా తీర్చిదిద్దామన్నారు. విద్యార్థులను లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

సత్తాచాటిన 'వాగ్దేవి' విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు దీపక్ 1,516వ ర్యాంక్, సాత్విక్ 3,219, కౌశిక్ 4,729 ర్యాంకుతో మెరిశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తాచాటడం గొప్ప విషయం అని, విద్యార్థులకు కళాశాలలో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులను రాఘవేంద్రరావు, శివకుమార్, నాగేందర్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాన్‌గల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం జమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బోయ వెంకటయ్య(34) ఈనెల 5న నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండలం నర్సాయిపల్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు జ్యోతినందన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ చెన్నమ్మ పరామర్శించారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నాడు.

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి శివారులో ఈ నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. పాన్‌గల్ మండలం జమ్మాపూర్‌కు చెందిన వెంకటయ్య (32), మహేష్ కొల్లాపూర్ మండలం ఎన్మబెట్లకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా మరో బైక్ ఢీ కొట్టడంతో వెంకటయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మంచి మాట



సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వమానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఇక ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు లుప్తం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

ఐకమత్యం తరువాత విశ్వమానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మానాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ

మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.


అంతరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అమలులో నిలపాలి.

ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికి ఇప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

గురువాణి

నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

''ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హై ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః ''

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్లు తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్టు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.

పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మబంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంత కన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.

తాత్త్వికథ

భాషా మాధుర్యం



ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.

ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు.

అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలుదేరుతున్న రచయితతో ''ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?'' అని అడిగాడు.

''నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను'' అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధ పడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా

గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?



రవితేజ

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.

వారికి కాజల్ ఓ ఉదాహరణ


– దర్శకుడు శేఖర్ కమ్ముల

''మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లు లాంటింది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు. ''నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు అఖిల్ డేగల. ''మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం'' అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



● శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ

నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!



● మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా

– నందితా శ్వేత



● అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

''హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ–''హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు అనూప్ రూబెన్స్.

మా నాన్న సూపర్ హీరో!



● సుధీర్‌బాబు

'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

ఇదేం జీవితం?



● రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాన్నీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. ''మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది'' అన్నారు ఎస్ఎస్ శాన్నీ.

రాకేష్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. చాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..

''ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు'' అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

సంక్రాంతికి జాతర



● ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–''జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.